
గ్రామాల పారిశుధ్యంపై

సోయి లేదా?

- నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్షా సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే ఆగ్రహం
- తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశం

8

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఇక వీడ్కోలు!

- నేడు జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం
- సిద్దిపేట జిల్లా తొలి పాలకవర్గానికి ఇక సెలవు
- జూలై 4తో ముగియనున్న సభ్యుల పదవీకాలం
- ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు వారమే గడువు
- సమావేశానికి మంత్రి పొన్నం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యే అవకాశం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 26 : సిద్దిపేట జిల్లా ఆవిర్భవించిన తర్వాత ఏర్పాటైన తొలి జిల్లా పరిషత్ పాలకవర్గానికి మరో వారం రోజులే గడువు ఉంది. జూలై 4తో వీరి ఐదేళ్ల పదవీ కాలం పూర్తవుతున్నది. ప్రతీ మూడునెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని నేడు చివరిసారిగా జరపనున్నారు. శాఖల పనితీరుపై సమీక్షించిన అనంతరం సభ్యులకు వీడ్కోలు పలకనున్నారు. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఎంపీలు రఘునందన్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, రఘోత్తమరెడ్డి హాజరయ్యే అవకాశం ఉంది.

2019 జూలై 5న జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు బాధ్యతలు చేపట్టారు. ఈ లెక్కన జూలై 4న వీరి పదవీకాలం పూర్తి కానున్నది. ఇప్పటికే మండల స్థాయిలో జరుగుతున్న సర్వసభ్య సమావేశాల్లో ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీపీలకు వీడ్కోలు పలుకుతున్నారు. కాగా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అత్యున్నత సమీక్షగా భావించే జడ్పీ సర్వసభ్య సమావేశంలో కేవలం జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులను సత్కరించి వీడ్కోలు పలకడానికి సిద్ధం చేస్తున్నారు.

21వ సర్వసభ్య సమావేశం..

ప్రతీ మూడు నెలలకు ఒకసారి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. ఏడాదికి 4 సమావేశాల చొప్పున ఐదేళ్లలో 20 సమావేశాలు పూర్తి చేశారు. కరోనా సమయంలో సమావేశాల నిర్వహణకు అవరోధాలు ఏర్పడినప్పటికీ అటుఇటుగా జరిపారు. పలు సందర్భాల్లో ఆయా పరిస్థితుల ఆధారంగా చర్చలు కొనసాగకుండానే ముగించారు. స్థాయీ సంఘ సమావేశాలను కూడా టంచన్ గా నిర్వహించారు. నేడు 21వ సర్వసభ్య సమావేశం జరగనున్నది. ఇందులో శాఖలపై సమీక్షతోపాటు సభ్యులంతా ఆత్మీయంగా వీడ్కోలు పలికే సందర్భం ఆవిష్కృతమవుతుంది. ఐదేళ్ల తమ పదవీకాలానికి సంబంధించిన అభిప్రాయాలను పంచుకోనున్నారు.

వారంతో పదవీకాలం పూర్తి..

జిల్లాలోని జడ్పీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్, 23 మంది ఎంపీపీలు, 23 మంది జడ్పీటీసీ సభ్యులు, 229 మంది ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం వచ్చేనెల 4తో ముగుస్తుంది. జడ్పీలో ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులు, మండలానికి ఒక కో-ఆప్షన్ సభ్యుల గడువు సైతం పూర్తవుతుంది. ఇప్పటికే 499 గ్రామపంచాయతీలకు సంబంధించిన సర్పంచ్‌ల పదవీకాలం ముగి సి ఐదునెలలు గడుస్తోంది. గ్రామాల్లో పరిపాలనకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకాధికారులను నియమించారు. ప్రస్తుతం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవులకు కాలం చెల్లినందున మండల స్థాయిలోనూ ప్రత్యేక అధికారులను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గడిచిన ఐదునెలల వ్యవధిలోనే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులంతా పదవీచ్యుతులయ్యారు. వీరిస్థానాల్లో కొత్తవారిని ఎన్నుకోవాలంటే మరో ఐదారునెలల సమయం పట్టే అవకాశాలున్నాయి.

తొలి పాలకవర్గంగా రికార్డు..

దశాబ్దాలుగా నెలకొన్న డిమాండ్ల తర్వాత 2016 అక్టోబరులో సిద్దిపేట జిల్లా ఏర్పాటైంది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఈ జిల్లాను ప్రారంభించారు. గతంలో ఈ ప్రాంత జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ అవసరాలకు, ప్రత్యేక సమావేశాలకు సంగారెడ్డి వెళ్లాల్సి వచ్చేది. 100 కిలోమీటర్ల ప్రయాణంతో వ్యయప్రయాసలకు గురయ్యేవారు. కానీ జిల్లా ఏర్పాటయ్యాక 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నూతనంగా జిల్లా పరిషత్‌ను ఏర్పాటు చేశారు. తొలి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా జనరల్ మహిళకు రిజర్వేషన్ కావడంతో చిన్నకోడూరు జడ్పీటీసీ సభ్యురాలు వేలేటి రోజారాధాకృష్ణశర్మకు అవకాశం దక్కింది. ఈమె ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఉద్యోగానికి వీఆర్ఎస్ తీసుకుని ఈ పదవి స్వీకరించారు. ఇక వైస్ ఛైర్మన్‌గా అక్కన్నపేట జడ్పీటీసీ సభ్యుడు రాయిరెడ్డి రాజిరెడ్డి బాధ్యతలు నిర్వర్తించారు. 23 మంది ఎంపీపీలు బీఆర్ఎస్‌కు చెందినవారే కాగా.. 23 మంది జడ్పీటీసీ సభ్యుల్లో మద్దూరు మండల జడ్పీటీసీ గిరి కొండాల్‌రెడ్డి మాత్రం కాంగ్రెస్ నుంచి ప్రాతినిథ్యం వహించారు. తొలి పాలకవర్గంగా వీరంతా సిద్దిపేట జిల్లా రికార్డుల్లో చోటు దక్కించుకున్నారు.

కోడలు కాపురానికి రావడం లేదని అత్త ఆత్మహత్య


స్వరూప (ఫైల్)

ములుగు, జూన్ 26: కోడలు కాపురానికి రావడంలేదని మనస్తాపంతో ఓ అత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికికల్సా గ్రామానికి చెందిన మరిగాల స్వరూప(45) కొడుకు, కోడలు గొడవ పడి.. కోడలు తమ అమ్మగారింటికి వెళ్లింది. కొన్ని రోజులుగా అక్కడే ఉంటోంది. అయితే, ఈ నెల 24న స్వరూప ములుగు మండల పరిధి సింగన్నగూడ గ్రామంలో తన బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. అక్కడి వారి బంధువులు 'మీ కోడలిని ఇంకా ఎప్పుడు తీసుకువస్తావు' అని స్వరూపు అడిగినట్లు సమాచారం. దీంతో మనస్తాపం చెందిన ఆమె మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి పోయింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో వెతకగా, ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం గ్రామ చెరువులో మహిళ మృతదేహం తేలి ఉందని సమాచారం అందుకున్న స్వరూప కుమారుడు వెళ్లి చూడగా, స్వరూప శవమై కనిపించింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై విజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత

- భావితరాలకు డ్రగ్స్‌రహిత సమాజాన్ని అందిద్దాం
- కలెక్టర్ మనుచౌదరి, జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, సీపీ అనురాధ
- అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీలు


ర్యాలీలో విద్యార్థులు



మిషన్ పరివర్తన ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న కలెక్టర్

సిద్దిపేట టౌన్/ సిద్దిపేట క్రైం, జూన్ 26: మాదక ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అని కలెక్టర్ మనుచౌదరి, జడ్పీ ఛైర్‌పర్సన్ రోజాశర్మ, సిద్దిపేట పోలీస్ కమిషన్ బి.అనురాధ తెలిపారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి పట్టణంలోని నూతన బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు, అలాగే సిద్దిపేట జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి పాత బస్టాండ్ వరకు బుధవారం ర్యాలీ చేపట్టారు. జడ్పీ ఛైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు అనే అంశంపై పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్, సీపీ ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే 'మిషన్ పరివర్తన' వాల్ ఫ్లెక్సీపై సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మైండ్ ఖాళీగా ఉండి ఏం తోచట్లేదన్నప్పుడు చెడు అలవాట్లకు, వ్యసనాలకు అలవాటు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. చెడు అలవాట్ల బారిన పడకుండా మీకంటూ ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం జడ్పీ ఛైర్‌పర్సన్ రోజాశర్మ మాట్లాడారు. చెడు అలవాట్ల వల్ల చాలా కుటుంబాలు ముఖ్యంగా మహిళలు ఎంతో బాధ పడుతున్నారని చెప్పారు. విద్యార్థులు చదువు మీద ధ్యాస పెట్టి, తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాటలను పాటిస్తూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. అలాగే, అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీ అనురాధ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణకు వ్యతిరేకంగా వారం పాటు పట్టణాలు, మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్నకలెక్టర్ ఎం.మనుచౌదరి, జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ


మాట్లాడుతున్న సీపీ అనురాధ

అదృశ్యమైన యువకుడు..

సంపులో శవమై

పటాన్‌చెరు, జూన్ 26 : మూడు రోజుల క్రితం అదృశ్యమైన యువకుడు అనుమానాస్పద స్థితిలో నీటి సంపులో శవమై దొరికిన సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ మియాపూర్ ప్రాంతంలోని పోగుల ఆగయ్యనగర్‌కు చెందిన నితిన్(26) ఆదివారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు మరుసటి రోజు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నితిన్ స్నేహితులు వెంకటేశ్‌తో పాటు కొందరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నితిన్ ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు పక్కన నిర్జనంగా ఉండే పాంచజన్యకాలనీలో పార్టీ చేసుకున్నట్లు తెలిసింది. మియాపూర్ పోలీసులు అమీన్‌పూర్ పోలీసులకు యువకుడి మిస్సింగ్ సమాచారం ఇచ్చారు. నితిన్ స్నేహితులైన వెంకటేశ్ మరో 12 మంది యువకులను అమీన్‌పూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. మొదట పొంతన లేని సమాధానాలు చెప్పగా, లోతుగా విచారించగా అసలు విషయం తెలిసింది. ఆదివారం రాత్రి నీటిట్యాంక్ వద్ద పుట్టిన రోజు పార్టీ చేసుకున్న తరువాత నితిన్ సంపులో పడి చనిపోయాడని తెలిపారు. నీటి సంపును పరిశీలించగా నితిన్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికి తీసి సంగారెడ్డి ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. గతంలో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేసిన నితిన్ ప్రస్తుతం ఖాళీగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. అదే కాలనీలో ఉండే వెంకటేశ్ ఆటో నడుపుతున్నాడు. వారు గంజాయి సేవించినట్లు తెలిస్తోంది. స్నేహితుల మధ్య వ్యక్తిగత పాత కక్షలతో ఘర్షణ పడ్డట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ప్రమాదవశాత్తు సంపులో పడి చనిపోయాడా? లేదా ఘర్షణలో దెబ్బలు తగిలి చనిపోయాడా అన్నది తేలాల్సి ఉంది. బర్త్‌డే పార్టీకి హాజరైన మిగతా వారిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

అంతర్ జిల్లా బైక్‌ల దొంగ అరెస్టు

- నిందితుడిపై పలు జిల్లాల్లో కేసులు
- 19 బైకులు, రూ.45వేల నగదు స్వాధీనం
- పట్టుబడిన వాహనాల విలువ రూ.40 లక్షలు
- రిమాండ్‌కు తరలించిన వన్ టౌన్ పోలీసులు

సిద్దిపేటక్రైం, జూన్ 26: సిద్దిపేట పట్టణంలో అంతర్ జిల్లా బైక్ దొంగను అరెస్ట్ చేసి 19 ద్విచక్రవాహనాలను వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సిద్దిపేట సీపీ అనురాధ కమిషనర్ కార్యాలయంలో బుధవారం వివరాలను వెల్లడించారు. సిద్దిపేటలోని గణేష్‌నగర్‌కు చెందిన విటకాల రవికుమార్ ఈ ఏడాది మార్చి 26న తన ఇంటి ముందు బైక్ పార్క్ చేశాడు. కాసేపటి తర్వాత వచ్చి చూడగా బైక్ కనపడలేదు. అతను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం పాతబస్టాండ్ చౌరస్తాలో వన్‌టౌన్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా మక్లూరు మండలం ధర్మారానికి చెందిన కుమ్మరి సాయికుమార్ అనుమానాస్పదంగా కనపడడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా పలు జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు తేలింది.

సాయికుమార్ 2020లో నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 దొంగతనం కేసుల్లో అరెస్టయ్యాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా చోరీలకు పాల్పడ్డాడు. ఈక్రమంలో అరెస్టయ్యి చెంచల్‌గూడ, నిజామాద్, చెర్లపల్లి జైళ్లలో 2022 వరకు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత 2022 జూలై నుంచి 2024 జూన్ వరకు హైదరాబాద్‌లో 4, కరీంనగర్ జిల్లాలో 3, నిజామాబాద్ జిల్లాలో 6, జగిత్యాల జిల్లా పరిధిలో 1, మెదక్ జిల్లాలో 1, నిర్మల్ జిల్లా పరిధిలో 1, సిరిసిల్ల జిల్లాలో 1, సూర్యాపేట 1, సిద్దిపేటలో 1, ఇలా మొత్తం 19 ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు సీపీ తెలిపారు. చోరీలకు పాల్పడిన బైక్‌లను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తుంటాడని పేర్కొన్నారు.

19 బైకులు స్వాధీనం

దొంగలించిన బైక్‌ను సిద్దిపేటలో అమ్మడానికి వెళ్తుండగా పాత బస్టాండ్ చౌరస్తాలో వన్‌టౌన్ పోలీసులకు చిక్కాడు. విచారణలో పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలింది. అతని వద్ద 4 పల్సర్, 3 రాయల్ ఎన్‌ఫీల్డ్, 9 యమహా కేటీఎం, 1 హోండా యాక్టివా, 2 హీరో హోండాలు, రూ.45వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీపీ పేర్కొన్నారు. పట్టుబడిన వాహనాల విలువ రూ.40లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.

అధికారులు, సిబ్బందిని అభినందించిన సీపీ

ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకుని, బైక్‌లను రికవరీ చేసినందుకు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిబాబు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, వన్ టౌన్ ఎస్ఐ నరసింహారావు, సీసీఎస్ సిబ్బంది యాదగిరి, కిషన్, సిద్దిపేట వన్ టౌన్ సిబ్బంది కనకరాజు, భూమలింగం, యాదగిరి, ఐటీ కోర్ కానిస్టేబుల్ శ్రీకాంత్‌లను సీపీ అభినందించి త్వరలో రివార్డు అందజేస్తామని తెలిపారు.


స్వాధీనం చేసుకున్న బైక్‌లను మీడియాకు చూపిస్తున్న సీపీ అనురాధ

పరిశ్రమలో కార్మికుడు మృతి

● కుటుంబీకుల ఆందోళన


కిరణ్ (ఫైల్)

హత్నూర/సంగారెడ్డి అర్బన్, జూన్ 26: సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ శివారులోని ఎపిటోరియా యూనిట్-3 పరిశ్రమలో బుధవారం విధులు నిర్వహిస్తూ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లా రామన్నగూడెం గ్రామానికి చెందిన గడిశాల కిరణ్ (34) కొన్నేళ్లుగా ఈ పరిశ్రమలో పర్మినెంట్ ఉద్యోగి. రోజువారీగానే మంగళవారం రాత్రి విధులకు వెళ్లాడు. బుధవారం ఉదయం రిలీవర్ వచ్చి చూడగా.. కిరణ్ కుప్పకూలి ఉన్నాడు. వెంటనే తోటి కార్మికులకు చెప్పడంతో వారంతా వచ్చి.. అంబులెన్స్‌లో సంగారెడ్డి సమీపంలో ఎంఎన్‌ఆర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కిరణ్ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

వాయువు లీక్ వల్లే.. : కుటుంబీకులు

పరిశ్రమలో జరిగిన ఏదో ప్రమాదం, వాయువు లీక్ వల్లే కిరణ్ మరణించి ఉంటారని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. విషయం బయటకు తెలియకుండా ఉండేందుకే యాజమాన్యం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించిందని అంటున్నారు. పర్మినెంట్ ఉద్యోగి అయిన కిరణ్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అయా పార్టీల నేతలు, కార్మిక సంఘాల ప్రతినిధులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఆదోళనకు దిగారు. రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించే వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేది లేదని స్పష్టం చేశారు. దీంతో పరిశ్రమ ప్రతినిధులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వారితో పలు దఫాలుగా చర్చలు జరిపారు. చేసేదేమీ లేక పరిశ్రమ ప్రతినిధులు అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించగా.. కార్మికసంఘాల నాయకులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ కుటుంబంలో ఎవరైనా చనిపోతే ఇలాగే వెళ్తారా..' అంటూ పరిశ్రమ ప్రతినిధులను నిలదీశారు. ఎక్స్‌గ్రేషియా ప్రకటించే వరకు ఇక్కడి నుంచి కదిలి లేదని వారు స్పష్టం చేశారు. స్పందించిన పరిశ్రమ యాజమాన్యం మృతుడి కుటుంబానికి రూ.40 లక్షలు(పీఎఫ్, ఈఎస్ఐతో సంబంధం లేకుండా) ఇస్తానని హామీ ఇచ్చింది. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతివేల మాణిక్, సీఐటీయూ జిల్లా నాయకులు యాదగిరి, కాంగ్రెస్ హత్నూర మండల కార్యదర్శి జగన్ యాదవ్, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు చెంచు శ్రీశైలం, ముత్యాలు పాల్గొన్నారు. చనిపోయిన కార్మికుడికి భార్య అర్చన, కూతుళ్లు సాయి అక్షయ, లాస్యలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుభాష్ తెలిపారు.


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వ్యవసాయ భూముల సర్వేపై శిక్షణ

● మా వల్ల కాదన్న కార్యదర్శులు

కంది, జూన్ 26: వ్యవసాయ భూముల సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న ఈ సర్వే అంతా మొబైల్ యాప్ ద్వారానే చేయాల్సి ఉంటుందన్నారు. ఈ యాప్ వెంటనే మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని తాము సూచించిన గ్రామాల్లో సర్వేని ప్రారంభించాలని పంచాయితీ కార్యదర్శులను ఆయన కోరారు. అలాగే, హరిత హారం కింద గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనుల తీరు, మిషన్ భగీరథ సర్వేపై ఆరా తీశారు. అయితే, వ్యవసాయ భూముల సర్వే తమ వల్ల కాదని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు. ఈ మేరకు వారు ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే గ్రామాల్లో రోజువారీ పనులతో పాటు మిషన్ భగీరథ సర్వే, మరుగుదొడ్ల సర్వేలతో సతమతమవుతున్నామని, కొత్తగా వ్యవసాయ సర్వే చేయలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ రెడ్డి, ఏవో ప్రసాద్, ఏపీవో గురుపాదం, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్ వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలి


దాబాలు, హోటళ్ల యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

కంది, జూన్ 26: కంది పరిధిలోని అన్ని హోటళ్లు, దాబాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. కందిలోని తహసీల్ కార్యాలయంలో బుధవారం దాబాలు, హోటళ్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వచ్చే 15 రోజులపాటు మాత్రమే పంచాయతీ సిబ్బంది చెత్తను సేకరిస్తారన్నారు. ఆపై దాబాల వద్దనే తడి, పొడి చెత్తలను వేరుచేసుకుని ఎరువుగా మార్చుకోవాలని సూచించారు. అందుకు అనువుగా దాబాల ఆవరణలో గుంతలను తవ్వకుని తడి చెత్తను, మిగిలిపోయిన ఆహార పదార్థాలను వేసి వర్మీ కంపోస్టును తయారు చేసుకోవాలని సూచించారు. అలాకాకుండా ఆరుబయట ఎక్కడబడితే అక్కడ దాబాల్లోని చెత్తను, మిగిలిపోయిన ఆహార పదార్థాలను పారబోస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పంచాయితీ అధికారి మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యాధర్ గౌడ్, దాబాలు, హోటళ్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి



మృతిచెందిన అజ్మత్‌పాష, అజ్మత్‌పాష(ఫైల్)

జహీరాబాద్, జూన్ 26: మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందాడు. చిరాగ్‌పల్లికి చెందిన అజ్మత్‌పాష(24) జహీరాబాద్‌లో మొబైల్ షాపును నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం దుకాణాన్ని తెరిచేందుకు మండలంలోని సత్వార్ గ్రామం వద్ద గల వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారి మీదుగా బైక్‌పై జహీరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వస్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్న క్రమంలో అజ్మత్‌పాష మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

మంజీరాలో దూకి మహిళ ఆత్మహత్య

కొల్చారం, జూన్ 26: నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ బుధవారం ఏడుపాయల మొదటి బ్రిడ్జి వద్ద మంజీరానదిలో శవమై తేలింది. కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్ కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోసపేట మండలం ఇసోజీగూడెంకు చెందిన వడ్డెర రవి, భార్య దేవకి, తల్లి అండాలు బతుకుదెరువు కోసం కొల్చారం మండలం పోతంశెట్‌పల్లికి వచ్చారు. ఈ నెల 22న పని విషయంలో తల్లీకొడుకులు గొడవ పడ్డారు. అదే రోజు సాయంత్రం అండాలు ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం ఏడుపాయల మొదటి బ్రిడ్జి వద్ద మంజీరాలో మహిళ మృతదేహం కనిపించగా, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రవిని పిలిపించి చూపించగా, తన తల్లి మృతదేహంగా గుర్తించాడు. ఆమె ఇంటి నుంచి బయటికి వచ్చిన రోజే నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి, హనుమాన్ బండల్ సమీపంలో ఖననం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు


చిల్కేపల్లికి వెళ్లే ప్రధాన తారు రోడ్డు పక్కనే పాతిన విద్యుత్ స్తంభాలు

కోహీర్ జూన్ 26: మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామ శివారులో గల 89వ సర్వేనెంబర్ ప్రాంతంలోని ఝరాసంగం మండలం చిల్కేపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన తారు రోడ్డు పక్కనే 33/11 కేవీ విద్యుత్ స్తంభాలను ప్రమాదకరంగా ఏర్పాటు చేశారు. హైవోల్టేజ్ గల విద్యుత్ స్తంభాలను తారు రోడ్డు పక్కనే పాతడం వల్ల వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు రోడ్డు పక్కన ఉన్న వేపచెట్లను నరికివేశారు. ఓ ప్రైవేట్ స్టీల్ కంపెనీ కోసం చెట్లను నరకడంపై దిగ్వాల్, చిల్కేపల్లి గ్రామస్థులు విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారులపై మండిపడుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ కోహీర్ మండల అధికారిని వివరణ కోరగా.. ఎక్కడ పాతినా ఏమీ కాదని బాధ్యతారహితంగా మాట్లాడడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారం స్పందించి రోడ్డు పక్కనే పాతిన స్తంభాలను తొలగించి రోడ్డుకు దూరంగా పాతాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చేయి.. చేయి కలిపారు.. రోడ్డు వేసుకున్నారు..


కల్హేర్ మండలంలోని ఫత్తేపూర్‌లో పొలాలకు రోడ్డు

కల్హేర్, జూన్ 26: ఆ ఊరి వారందరి పంట పొలాలు అక్కడే ఉన్నాయి. కానీ, అక్కడి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గమే లేదు. దీంతో ఆ రైతులంతా ఒక్కటయ్యారు. ఎవరో వస్తారని ఎదురుచూడకుండా తలో చేయి వేసి.. తమ పంట పొలాలకు రోడ్డు వేసుకున్నారు. మండలంలోని ఫత్తేపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన సుమారు 250 ఎకరాల భూములకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో రైతులంతా రోడ్డు వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఎకరాకు రూ. 250 చొప్పున వేసుకుని.. మట్టి రోడ్డు వేసుకుని ఆదర్శంగా నిలిచారు.

ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి!

● నేడు విధుల్లో చేరాలని ఆదేశాలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 26: ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా జడ్పీ యాజమాన్య పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందేందుకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో ఎస్ఏలుగా పదోన్నతి ఉత్తర్వులు బుధవారం రాత్రి వెలువడనున్నాయి. ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు గురువారం విధుల్లో చేరాలని అధికారులు స్పష్టం చేశారు. కాగా నేటి నుంచి ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ఎస్జీటీల బదిలీ ప్రక్రియ ప్రారంభం కానున్నది.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

చేగుంట, జూన్ 26 : పంటలపై ఎన్నో ఆశలతో అప్పులు తెచ్చి సాగు చేసిన ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్నశివునూర్‌లో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన చింతల సత్తయ్య (52)కు రెండెకరాల భూమి ఉంది. పంటల సాగు కోసం అప్పులు చేశాడు. ఓ వైపు పంటల దిగుబడి సరిగా రాకపోవడం, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ తరుణంలో అప్పులు తీర్చే మార్గం కనిపించక జీవితంపై విరక్తితో బుధవారం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

పట్టా భూములకు రక్షణ కల్పించండి

● తహసీల్దార్‌కు రైతుల వినతి

మాసాయిపేట, జూన్ 26: పట్టా భూములకు రక్షణ కల్పించండని అక్కంపేట రైతులు తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. అక్కంపేట పరిధిలోని 161 సర్వే నంబర్లు గల తమ వ్యవసాయ పట్టా భూమిని పక్కనే గల కొందరు బడా నాయకులు కబ్జాలకు పాల్పడుతూ పంటలను సైతం చెడగొడుతున్నారని గ్రామానికి చెందిన ప్రసన్నకుమారి అనే మహిళా రైతు కుటుంబసభ్యులతో కలిసి తహసీల్దార్ జ్ఞానజ్యోతికి విన్నవించారు. పట్టా పాస్ బుక్, ధరణి రికార్డులలో తమ పేరుపై భూమి ఉన్నదన్నారు. అయితే కొందరు బడా నాయకులు రెండురోజులుగా ట్రాక్టర్లతో దున్నుతూ కబ్జాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు సర్వే నిర్వహించి, తమ భూమిని కాపాడాలని వేడుకున్నారు.


సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు


గజ్వేల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి, పోలీసులు



హుస్నాబాద్‌లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు, యువకులు


వర్గల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

డ్రగ్స్ నివారణలో యువత పాత్ర కీలకం


మర్కుక్: ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు


చేర్యాల అంగడిబజారులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


తొగుట: వ్యాసరచన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న సీఐ లతీఫ్


రాయపోల్‌లో విద్యార్థులు, యువకులు, పోలీసులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ రఘుపతి

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ఆయా పాఠశాలల్లో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువతకు అవగాహన కల్పించారు. వారితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

సిద్దిపేట క్రైం, జూన్ 26: డ్రగ్స్ నివారణలో యువత పాత్ర కీలకమని సిద్దిపేట ప్రముఖ డాక్టర్ రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువతకు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. చివరగా ఉపన్యాస, వ్యాసరచన పోటీలో విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రసాదరావుతో కలిసి బహుమతులు అందచేశారు. తర్వాత కళాశాల నుంచి ముస్తాబాద్ చౌరస్తా వరకు ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రోగ్రాం అధికారులు డ్రగ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మూల రంజిత్ రెడ్డి, కోర్డినేటర్ జి.కిరణ్ కుమార్, ఎన్‌సీసీ అధికారి ఆర్.మహేందర్‌రెడ్డి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు వాసం శ్రీనివాస్, డా. ఎం. శ్రద్ధానందం, డా. పి. పల్లవి, డా. ఎస్ మహేందర్, డా రాణి, బి కృష్ణయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి, గజ్వేల్ ఆర్డీవో బి.బన్సీలాల్ పేర్కొన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని ఏసీపీ కార్యాలయం నుంచి గజ్వేల్ పోలీస్‌స్టేషన్ వరకు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌తో కలసి ఏసీపీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ డ్రగ్ ఫ్రీ డివిజన్‌గా మార్చేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ బి.సైదా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** పట్టణంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం హుస్నాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో విద్యార్థులు, ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ శ్రీనివాస్ మట్లాడుతూ అందరి భాగస్వామ్యంతోనే మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మహేష్, తిరుపతి, వివేక్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

● **వర్గల్:** మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులు డ్రగ్స్ నిర్మూలనపై ప్ల కార్డులు ప్రదర్శిస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గౌరారం ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాలు యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌గౌడ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **మర్కుక్:** మండలకేంద్రంలో మర్కుక్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఎస్‌ఐ మధూకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు ఉపన్యాసం, పెయింటింగ్‌లో పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని కళాశాల పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత, విద్యార్థులు అంతా యాంటీ డ్రగ్స్ కమిటీల్లో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్స్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ గంగరాజు, మిరుదొడ్డి ఎస్‌ఐ పరశురాములు అన్నారు. బుధవారం దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోలీసులు విద్యార్థులతో కలిసి ప్రధానవీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. మిరుదొడ్డి మండలంలోని కొండాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన కల్పించారు.

● **తొగుట:** డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దామని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. బుధవారం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులతో కలిసి తొగుటలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని పాఠశాల, కళాశాల యాజమాన్యాలకు సూచించారు. అంతకు ముందు ఉపన్యాసం, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

● **చేర్యాల:** చేర్యాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్ నుంచి అంగడిబజారు క్రాస్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమానికి హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ హాజరై మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వ్యాసరచన, ఉపన్యాసం, పెయింటింగ్ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ శ్రీను, ఎస్‌ఐ దామోదర్, పాల్గొన్నారు.

● **రాయపోల్:** రాయపోల్, బేగంపేట గ్రామాల్లో విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులతో కలిసి పోలీసులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి, బేగంపేట ఎస్‌ఐ భువనేశ్వర్, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన గంజాయి


వివరాలు వెల్లడిస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

దౌల్తాబాద్, జూన్ 26: మండల పరిధిలోని ఇందుప్రియాల్ ఎక్స్‌రోడ్‌లో దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్‌ప్రేమ్‌దీప్ పోలీస్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడ్డారు. బుధవారం గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఇందుప్రియాల్ ఎక్స్‌రోడ్‌లో దౌల్తాబాద్ పోలీస్‌లు బుధవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా పారిపోయేందుకు యత్నించడంతో పోలీసులు వెంబడించి 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిలో దొనపల్లి రాజు(19), పిట్ల నవీన్ (23), తొర్రి దర్శన్(19) ఉన్నారు. నిందితుల నుంచి ఒక బైక్, 3 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

నార్కోటిక్ డాగ్స్‌తో గంజాయి, డ్రగ్స్‌పై తనిఖీలు

మర్కుక్, జూన్ 26: మర్కుక్ పోలీస్‌స్టేషన్ పరిదిలో కర్కపట్ల, ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్స్(పోలీస్ జాగిలం)తో గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మర్కుక్ ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో తనిఖీలను నిర్వహించామన్నారు. మత్తు పదార్థాల సమూలంగా నిర్మూలించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు.

సిద్దిపేటలో నిషేధిత గుట్కాలు స్వాధీనం

సిద్దిపేట క్రైం, జూన్ 26 : సిద్దిపేట పట్టణంలోని సుభాష్‌రోడ్ సీఎస్‌ఆర్ ఎంటర్ ప్రైజెస్ షాపులో ఇరుకుల చంద్రశేఖర్ అనే వ్యక్తి ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారమందింది. దీంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట టూ టౌన్ పోలీసులు కలసి వెళ్లి షాపులో తనిఖీలు నిర్వహించగా, రూ.2లక్షల5వేల విలువైన గుట్కాలు టొబాకో ప్యాకెట్లు పట్టుబడ్డాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మొలకెత్తని వరి విత్తనాలు.. రైతుల్లో ఆందోళన


మొలకెత్తని విత్తనాలను చూపిస్తున్న రైతులు

అక్కన్నపేట, జూన్ 26: వానాకాలంలో రైతులు కొనుగోలు చేసిన వరి విత్తనాలు వారం రోజులు దాటినా మొలకెత్తలేదని బుధవారం మండలంలోని రామవరం గ్రామంలో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. రామవరం గ్రామంలోని ఓ విత్తన షాపులో ఓ దొడ్డు రకానికి చెందిన వరివిత్తనాలు 30 కిలోల బస్తా ధర రూ. 1,020 చొప్పున 16 ఎకరాలకు గానూ 32 బస్తాలను కొనుగోలు చేశామన్నారు. అయితే నానబెట్టి మండె కట్టిన మూడు నాలుగు రోజుల్లో మొలకెత్తాల్సిన విత్తనాలు వారం రోజులు దాటినా మొలకెత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీడ్స్ షాపు డీలర్‌ను ప్రశ్నిస్తే తనకు సంబంధం లేదంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని రైతులు వాపోయారు. వ్యవసాయశాఖ అధికారులు తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఇందులో రైతులు ఎడబోయిన రాజిరెడ్డి, ఎడబోయిన గణేష్ రెడ్డి, ఎడబోయిన లింగారెడ్డి, బొమ్మ నవీన్ తదితరులు ఉన్నారు.

కొమ్మూరి కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలి

చేర్యాల జూన్ 26: చేర్యాల ప్రాంతంపై మొసలి కన్నీరు కార్చుతున్న మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆక్రమించిన ప్రభుత్వ భూదాన్, సీలింగ్ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని సీపీఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందే బీరన్న డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక షాదీ ఖానాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రైతులకు మాయమాటలు చెప్పి వందల ఎకరాలు తన పేరిట, తన కుటుంబ సభ్యుల పేరిట అక్రమంగా పట్టాలు చేయించుకున్నాడని ఆరోపించారు. సుమారు 30ఎకరాల ప్రభుత్వ సీలింగ్, భూదాన్ భూములను సైతం తన ఆధీనంలో ఉంచుకొని రైతులను బురిడీ కొట్టించాడన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులను ప్రలోభపెట్టి రికార్డులు మార్చేశారని ఆరోపించారు. చేర్యాల రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.1030లో 7.01ఎకరాల భూదాన్ సీలింగ్ భూమిని అక్రమంగా మార్పిడి చేసుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. అంతేకాకుండా ముస్త్యాల, రేబర్తి, లద్నూరు, బంజర శివారులలో భూములను ఆక్రమించాడన్నారు. చేర్యాల పట్టణంలోని సర్వే నెం.984, 985, 987లలో వెంచర్ చేసి ప్లాట్లు అమ్ముకున్నాడన్నారు. మున్సిపాలిటీకి అప్పగించాల్సిన భూమిని ఇతరులకు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నాడని, దీనిని చేర్యాల మున్సిపాలిటీ అధికారులు అడ్డుకోవాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు పోలోజ్ కుమారస్వామి, ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్ కుమార్, రాళ్లబండి నాగరాజు, ఆముదాల నర్సిరెడ్డి, ముస్త్యాల ప్రభాకర్ పోలోజు శ్రీహరి, రాళ్లబండి భాస్కర్, బోయిని మల్లేశం, ఎర్రబోను అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలను త్వరగా నిర్వహించాలి

● రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం కార్యనిర్వాహణ అధ్యక్షుడు దేవీ రవీందర్

గజ్వేల్, జూన్ 26: సర్పంచ్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం కార్యనిర్వాహణ అధ్యక్షుడు దేవీ రవీందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారాయన్నారు. సఫాయి కార్మికులకు జీతాలు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

కేంద్ర ప్రభుత్వ అగ్నిపథ్ పథకాన్ని ఉపసంహరించుకోవాలి

సిద్దిపేట అర్బన్, జూన్ 26: భారత రక్షణ రంగాన్ని ప్రైవేటు పరం చేసే అగ్నిపథ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ పాత పద్ధతిలోని కొనసాగించాలని, యువతకు ఉపాధి అవకాశాలు యుద్ధప్రాతిపదికన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగామ రాజకుమార్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సురేందర్, శ్రీను, లతా తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్ పంపిణీలో అవకతవకలపై ఫిర్యాదు

చేర్యాల, జూన్ 26: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందజేస్తున్న ఆసరా పింఛన్ డబ్బుల పంపిణీలో పలువురు పోస్టల్‌శాఖ సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ఆకునూరు గ్రామంలో చోటుచేసుకున్న సంఘటనే ఇందుకు నిదర్శనం. గ్రామానికి చెందిన జంగం కిష్టయ్య కొన్నాళ్లుగా వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాడు. అనివార్య కారణాల వల్ల మే నెల పింఛన్ డబ్బు రాలేదు. జూన్ నెల పింఛన్ పంపిణీ చేస్తుండటంతో బుధవారం వెళ్లి పింఛన్ డబ్బులు అడగడంతో పోస్టల్ సిబ్బంది ఒక నెల డబ్బులు మాత్రమే ఇచ్చారు. మే నెల డబ్బులు ఇవ్వాలని అడగడంతో నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పాటు పెన్షన్ పాస్‌బుక్‌లో 5వ నెల డబ్బులు ఇచ్చినట్లు రాయడంతో నిలదీశాడు. అనంతరం ఈ విషయమై చేర్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

శ్రీవైష్ణవ సంఘం రజతోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేట టౌన్, జూన్ 26: శ్రీ వైష్ణవ సంఘం ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో రజతోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర సంఘం నిర్ణయించినట్టు సిద్దిపేట జిల్లా శ్రీ వైష్ణవ సంఘం అధ్యక్షుడు చిలకమర్రి వెంకటరమణాచార్యులు పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఆ సంఘం రజతోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 20న శనివారం ఉదయం 10 నుంచి ఉత్సవాలు మొదలవుతాయన్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన ఇంటర్, పదవ తరగతులలో ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీవైష్ణవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్టు చెప్పారు.

పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడులు

మద్దూరు, జూన్ 26 : పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతంగా మారుతుందని తద్వారా నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చునని ఏవో రామకృష్ణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎండీ. సిద్దిఖ్ వ్యవసాయ పొలంలో సాగుచేసిన పచ్చిరొట్ట సాగును సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో రాకేష్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేర్యాల, జూన్ 26: విద్యుత్ మరమ్మతుల సందర్భంగా గురువారం పట్టణంలోని గాంధీచౌక్ ఏరియా నుంచి సెవెన్ హిల్స్ ప్రాంతం వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ చేర్యాల టౌన్ ఏఈ తాబ్రేజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీజ్ చేసిన ఇసుక వేలం నేడు

ధూళిమిట్ట,జూన్ 26: జాలపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా తరలించి డంపు చేసిన దాదాపు 150 ట్రాక్టర్ల సీజ్ చేసిన ఇసుకను గురువారం వేలం వేయనున్నట్లు ధూళిమిట్ట తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు రూ. 5వేల డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలనీ సూచించారు.

బబ్బిలి చెరువు కట్టపై ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మిరుదొడ్డి, జూన్ 26: మిరుదొడ్డిలో బబ్బిలి చెరువు కట్టను ధ్వంసం చేసిన దుండగులపై చర్యలను తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. బుధవారం మిరుదొడ్డిలోని బబ్బిలి చెరువుకట్టను జెసీబీ, ట్రాక్టర్ల సహాయంతో తొలిచివేస్తున్నారని తెలిపారు. కట్టను ధ్వంసం చేసే వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్

చేర్యాల, జూన్ 26: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, ప్రైవేట్ పాఠశాలలో అధిక పీజులు వసూలు చేయడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ బుధవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు బంద్ ప్రకటించగా, ఏబీవీపీ నాయకులు ప్రభుత్వ పాఠశాలల తరగతులను బంద్ చేయించారు.

● **నంగునూరు:** మండలంలోని వివిధ పాఠశాలల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో తరగతులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేవని, ప్రైవేట్ పాఠశాలలో విచ్చలవిడిగా ఫీజులు ప్రభుత్వం ప్రైవేట్ బడులను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నరేష్, లవ కుమార్, దోమల సూర్యం, కృష్ణ ప్రసాద్, గౌరబోయిన రాజు, చంద్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఏబీవీపీ ఇచ్చిన బంద్ పిలుపు హుస్నాబాద్‌లో విజయవంతమైంది.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

చిన్నకోడూరు, జూన్ 26 : కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు పార్టీ తగిన గుర్తింపును ఇస్తుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం జిల్లా కార్యదర్శిగా మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన ఎండీ. యూసుఫ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మజారుద్దీన్ నియామక పత్రాన్ని జారీచేయగా బుధవారం చిన్నకోడూరులో నియామక పత్రాన్ని ఆయన యూసుఫ్‌కు అందజేశారు.

గ్రామాల పారిశుధ్యం పై సోయి లేదా?

● నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్షా సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే ఆగ్రహం


సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే, కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్, హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

దుబ్బాక, జూన్ 26: వర్షాకాలం ముంచుకొచ్చింది.. పారిశుధ్యం మీద సోయిలేదు. కనీసం మురికి కాలువ పక్కన గడ్డిని కూడా తొలగించడంలేదంటూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే కాలంలో గ్రామాల్లో పారిశుధ్యం లేకుంటే ప్రజల ఆరోగ్యం ఏం కావాలని ఆయన ప్రశ్నించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి ఆధ్వర్యంలో దుబ్బాక సమీకృత భవనంలో జరిగిన నియోజకవర్గస్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరునెలలుగా గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయి వ్యాధులకు కారకంగా మారుతున్నాయన్నారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా లేని దుస్థితి నెలకొందన్నారు. అంగన్‌వాడీల్లో పరిశుభ్రత కొరవడిందని, వ్యవసాయ శాఖ, విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు సరిగా లేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. తమ గ్రామంలో సుమారు 6నెలలుగా చెత్త సేకరణ చేయడంలేదని పద్మశాలిగడ్డ మాజీ సర్పంచు ఆవేదన వ్యక్తం చేశారు. వారానికి ఒక్కసారి చెత్త సేకరిస్తున్నామని అధికారులు బదులివ్వగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రోజు చెత్త సేకరణ జరపాలని ఆదేశించారు. అల్వాలా గ్రామంలోని బీసీకాలనీ, ఎస్సీ కాలనీలో మిషన్‌భగీరథ నీరు రావడంలేదనీ మిరుదొడ్డి వైస్ ఎంపీపీ రాజు తెలుపడంతో వెంటనే బూస్టర్ పంపు బిగించి, నీళ్లను అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంచినీటి సమస్య పరిష్కారానికి కావల్సిన చర్యలను చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో 62 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతభవనం, కనీస వసతులు అవసరమని సీడీపీవో కలెక్టర్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. అంగన్‌వాడీలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్ రూట్లపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలో లేకపోయినా కేవలం ప్రజల క్షేమం కోసమే పని చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జడ్పీటీసీలు, ఎంపీపీలు రవీందర్‌రెడ్డి, కొత్త పుష్పలత, రణం జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి తదితరులున్నారు.

రాజకీయ నాయకులకు రిటైర్మెంట్ ఉండదు

● వర్గల్ ఎంపీపీ లత రమేశ్‌గౌడ్


అభినందన సభ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జాలిగామ లతారమేశ్‌గౌడ్

వర్గల్, జూన్ 26: ప్రజాసేవ చేసే రాజకీయ నాయకులు రిటైర్మెంట్ అంటూ ఏమి ఉండదని, జీవితాంతం ప్రజలకు సేవ చేసే అవకాశం ఉంటుందని వర్గల్ ఎంపీపీ జాలిగామ లతారమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఎంపీపీ పాలకవర్గం గడువు పూర్తి కావస్తున్నందున బుధవారం వర్గల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లతా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఇంతవరకు తాము రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మండలంలోని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. అభివృద్ధి పనుల్లో మండల స్థాయి అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. కరోనాతో రెండేళ్లపాటు అనుకున్నంత అభివృద్ధిని సాధించలేకపోయినప్పటికీ, అదే సమయంలో ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. గ్రామాల అభివృద్ధికి సహకరించిన ఎంపీటీసీలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎంపీటీసీలను, మండల స్థాయి అధికారులను ఎంపీపీ లతారమేశ్‌గౌడ్ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాలు యాదవ్, వైస్ ఎంపీపీ కడపల బాల్‌రెడ్డి, ఎంపీడీవోలు విజయలక్ష్మీ, స్వర్ణకుమారి, తహసీల్దార్ బాల్‌రాజు, ఎంపీటీసీలు జయమ్మ బీంరెడ్డి, సజనీత బుచ్చిరెడ్డి, వెంకటేశ్‌గౌడ్, స్వాతి, జనార్ధన్, కోఆప్షన్ సభ్యులు మహ్మద్ ఫారుఖ్, మండల స్థాయి అధికారులు సునీత, డాక్టర్ హరిత, శ్రీధర్, ఎంపీవో కలీంతో పాటు గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సిద్దిపేట అర్బన్, జూలై 26: కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులతో కలిసి బుధవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు పరిధిలో కొనసాగుతున్న వారిని పర్మినెంట్ చేసి కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, ఇన్ ఎంఆర్, ఫిక్స్ పే విభాగాల్లో ఉన్న కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూనాయకులు శోభ, కమిటీసభ్యులు తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన మాజీ కౌన్సిలర్


ఢిల్లీలో కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ సన్మానిస్తున్న వెంకట్

సిద్దిపేట క్రైం, జూన్ 26: పార్లమెంట్‌లో విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేసిన కేంద్ర మంత్రులను, పార్లమెంట్ సభ్యులను ఢిల్లీలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బాసంగారి వెంకట్ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లను కేంద్ర మంత్రులుగా నియమించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని వారి నివాసంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను మెదక్ ఎంపీ రఘునందన్‌రావును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మెదక్‌లో రఘునందన్‌రావు గెలుపునకు కృషిచేసిన ప్రతీ కార్యకర్తకు కృతజ్ఞతలు తెలియజేశారు.


అక్కన్నపేట తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

తహసీల్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

అక్కన్నపేట, జూన్ 26: ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టాలు చేస్తున్న తహసీల్దార్ సంజీవ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం అక్కన్నపేట తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 436లో ఉన్న 1.14 ఎకరాల భూమిని ఓ రైతు పేరు మీద తహసీల్దార్ సంజీవ్‌కుమార్ అక్రమంగా పట్టా చేశారని ఆరోపించారు. ఇందులో నుంచి వాగు ఉందని ఈ వాగును సైతం పట్టా చేశారని మండిపడ్డారు. వాగు ఉన్న భూమిని పట్టా చేయవద్దని పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా అక్రమంగా పట్టా చేశారని వాపోయారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ధర్నాలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ పీరెల్లి లింగమూర్తి, ఉప సర్పంచ్ పీరెల్లి రాధా రవీందర్, అశోక్ తదితరులు ఉన్నారు.

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో సిద్దిపేట విద్యార్థికి 91వ ర్యాంక్


చాణక్య

సిద్దిపేట క్రైం జూన్ 26 : సిద్దిపేట పట్టణంలోని స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాల విద్యార్థి చాణక్య గత నెలలో జరిగిన పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ ఎంట్రెన్స్‌లో దేశ వ్యాప్తంగా 91వ ర్యాంక్ సాధించాడు. తాను ప్రతిభ కళాశాలలో అందజేసిన ప్రత్యేకమైన శిక్షణ ద్వారానే ఈ ర్యాంక్ సాధించ గాలిగానని చాణక్య తెలిపారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ట కలిగిన పాండిచ్చేరి యూనివర్సిటీలో తమ స్టూడెంట్ ఇంత మంచి ర్యాంక్ సాధించడం అభినందనీయం అని ప్రిన్సిపాల్ సూర్య ప్రకాశ్‌రావు తెలిపారు.

అక్షరజ్యోతి సేవలు ఆదర్శప్రాయం

● జిల్లా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, జూన్ 26: గ్రామీణ పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి అక్షర జ్యోతి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని సిద్దిపేట జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కొమురవెల్లి మండలం గురువన్నపేట జడ్పీఎస్ఎస్ విద్యార్థుల సౌకర్యార్థం ఫౌండేషన్ నిర్వాహకులు 10డెస్క్‌బెంచీలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నాణ్యమైన విద్యనందించే ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పాటుపడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అక్షరజ్యోతి సేవలను మరింత విస్తరించాలని కోరారు.

కేసీఆర్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్


కేసీఆర్‌కు మొక్కను అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 26: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధా కృష్ణశర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 27న జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కేసీఆర్ కు ఆమె తెలిపారు. ఐదేళ్లపాటు సిద్దిపేట జిల్లాకు జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినందుకు మాజీ సీఎంకు, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 26: నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, లైసెన్స్ రద్దు చేస్తామని డీఏవో మహేష్ తెలిపారు. బుధవారం సిద్దిపేట, సిద్దిపేట అర్బన్ పరిధిలోని విత్తన, ఎరువుల పురుగుమందుల దుకాణాలను సిద్దిపేట ఏవో పరశురాంరెడ్డి, ఏఈవో శ్రీకాంత్ రెడ్డితో కలసి తనిఖీ చేశారు. దుకాణాదారులుకు రైతులకు మేలైన విత్తన రకాలను, వంగడాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులకు తప్పనిసరిగా వారి కొనుగోళ్లకు సంబంధించినటువంటి రశీదులను ఇవ్వాలని ఆయన తెలిపారు.